క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మల్లన్న సేవలో ధర్మవరం ఎమ్మెల్యే



ఆలయ ప్రాంగణంలో కుటుంబసభ్యులతో ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను మంగళవారం ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామివార్లకు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

36 మందికి కంటి శస్త్ర చికిత్సలు



కంటిశస్త్ర చికిత్సల నిమిత్తం వెళ్తున్న దృశ్యం

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలోని కొత్తపల్లి, గోకవరం, ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గ్రామాల నుంచి 36 మందిని వైద్యాధికారులు కంటి శస్త్రచిత్సల నిమిత్తం గుర్తించారు. వీరిని వైద్యులు దీపానాగవేణి, విజయేంద్రవర్మ, జబీర్ మంగళవారం కంటి చికిత్సల నిమిత్తం కంటివైద్య నిపుణులు షేక్షావలి ఆధ్వర్యంలో నంద్యాలలోని శాంతిరాం వైద్యశాలకు పంపించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలకృష్ణ, వైద్యసిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

వెలుగోడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కర్షక, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కార్మిక, కర్షక, రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల క్రితం ఢిల్లీలో జరిగిన మూడు నల్ల వ్యవసాయ చట్టాల రద్దు కోసం మహా పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ దేశవ్యాప్తంగా మహా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘాల నాయకులు గోవిందు, యాదాటి నాగేంద్రుడు, ఎల్లాల కృష్ణుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు లాభదాయకం



మల్యాలలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్ : మండలంలోని రైతులు భూసార పరీక్షలను చేయించుకోవడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని ఏఓ షేక్షావలి సూచించారు. మంగళవారం మల్యాల గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు శనగ పంటలో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా తెగుళ్ల నివారించవచ్చన్నారు. అనంతరం గ్రామంలోని రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం చక్రవర్తి, వీఏఏ శాంతిరాజు పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

నందికొట్కూరు: మార్కెట్ యార్డు వద్ద బైక్ అదుపు తప్పిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతూ సోమిశెట్టి శివానందమ్మ (56) కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన సోమిశెట్టి శివానందమ్మ, వీరప్పకు మార్కెట్ యార్డు వద్ద బైక్ అదుపు తప్పిన ఘటనలో తీవ్రగాయాలైన అందరికీ తెలిసిందే. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు క్షతగాత్రులను తరలించారు. చికిత్స పొందుతూ మూడు రోజుల వ్యవధిలోనే భార్యభర్తలిద్దరూ మృతి చెందడంతో కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. కుమారుడు లింగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ఎస్ఐ అశోక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్



తరిగోపులలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



పగిద్యాలలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య




మిడుతూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మండల నాయకులు

ప్రజా శ్రేయస్సు కోసమే సంక్షేమ పథకాలు

- అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- పెద్దగుమ్మడాపురం, మద్దూరు గ్రామాల్లో 'పల్లెకు పోదాం'

కొత్తపల్లి: రాష్ట్రాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కాకపోతే రాష్ట్రంలో సంక్షేమం కుంటుపడుతుందన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దగుమ్మడాపురం సచివాలయం వద్ద జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, సర్పంచు నక్క విజయ్‌కుమార్ అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి రెండింటిపై దృష్టిసారిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. రాష్ట్రం అభివృద్ధిలో నడవాలన్న, ప్రజలకు సంక్షేమఫలాలు నిష్పక్షపాతంగా అమలు కావాలన్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.17,96,18,073లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగలక్ష్మీరెడ్డి, జగనన్న ఇళ్ల స్థలాల మండల కో–ఆర్డినేటర్ పరశురాముడు, సర్పంచులు చంద్రశేఖర్ యాదవ్, కలబండి మారెన్న, ఎంపీటీసీ శివన్న, వైస్ సర్పంచు శ్రీనివాసులు యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పెద్దగుమ్మడాపురంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

పిల్లలకు అందించాల్సిన ఆస్తి చదువు

పాములపాడు: పిల్లలకు తల్లిదండ్రులు అందిచాల్సిన ఆస్తి చదువేనని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండలంలోని మద్దూరు గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లులర్పించి, వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మద్దూరు గ్రామానికి 33 పథకాల ద్వారా గ్రామస్తులకు రూ.29,96,18,437 లబ్ధి చేకూరిన వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి చదువు అవసరమనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన అమ్మఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతీ దీవెన పథకాలతో విద్యకు ప్రాధాన్యత కల్పించారని కొనియాడారు.

ఎస్ఐని అభినందించిన ఎమ్మెల్యే

రెండు రోజుల క్రితం మండలంలోని జూటూరు గ్రామానికి చెందిన విద్యార్థి విష్ణువర్ధన్ కిడ్నాప్ కేసును 48 గంటల్లోనే ఛేదించి తల్లి దండ్రులకు అప్పగించిన ఎస్ఐ అశోక్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ, ఎంపీటీసీ బషీరాహ్మద్, సర్పంచులు వేంపెంట మాణిక్యమ్మ, ఇస్కాల మౌలాలి, కో ఆప్టెడ్ ముర్తుజావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాములమ్మ, ముడియాల రమణారెడ్డి, మహ్మద్ గౌస్, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని లోని 14వ సచివాలయం పరిధిలో 13, 27వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. 7వ సచివాలయ పరిధిలో మొత్తం రూ.41,84,85,504 ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ షేక్ రహత్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు శాంతకుమారి, సమీరాబాను, లాలు, రవూఫ్, హమీద్, జేసీఎస్ కన్వీనర్ అబుబక్కర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, నాయకులు జబ్బార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలిచ్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ సువర్ణమ్మ, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం తరిగోపుల గ్రామ సచివాలయం పరిధిలో మానమ్మకం నువ్వే జగన్–పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ తరిగోపుల గ్రామస్తులకు 33 సంక్షేమ పథకాల ద్వారా రూ. 27,09, 47,327 లబ్ధిచేకూరిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెంకటరమణ, నాయకులు దొడ్డాసుధాకర్, గోవిందు, గోపాల్‌రెడ్డి, బాలస్వామి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశానికే ఏపీనే ఆదర్శం

పగిద్యాల: సంక్షేమ పథకాల అమలులో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, సచివాలయ కన్వీనర్ రమేష్‌నాయుడు, పార్టీ మండల కన్వీనర్ పుల్యా నాగిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం–1 పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అధ్యక్షతన చేపట్టారు. వివిధ అభివృద్ధి పనుల నిమిత్తంగ్రామానికి ప్రభుత్వం రూ.31,58,58,604 వ్యయం చేసినట్లు చదివి వినిపించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, ఎంపీటీసీలు పగడం గోపాల్, మిద్దె స్వాములు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కొణిదేలలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేస్తున్న మండల నాయకులు

జగనన్నతోనే సంక్షేమం

మిడుతూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నతోనే సంక్షేమం సాధ్యమవుతుందని మండల ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మిడుతూరు–1 సచివాలయ పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విద్య పోగు జయలక్ష్మమ్మ, పీరుసాహెబ్ పేట సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నాగతులసీ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తువ్వా శివరామక్రిష్ణారెడ్డి, ఐటీ వింగ్ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే సంక్షేమ ఫలాలు

నందికొట్కూరు రూరల్ : పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రవియాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో వైనీడ్ ఏపీ జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ నవీన్‌కుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ రాహత్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ పబ్బతి రవి, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

అత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, పట్టణాధ్యక్షుడు సయ్యద్ మీర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో మంగళవారం వై ఏపీ నీడ్స్‌జగన్ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ప్రజలకు రూ.13 కోట్లకు పైగా నేరుగా లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజగోపాల్ , కలిముల్లా, మోతుల్లా, రమణ, విజయచౌదరి, , ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



అత్మకూరులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్

పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

వెలుగోడు: పేద కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 2వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, నాయకులు షంషీర్ అలీ, పులి గోవర్ధన్ రెడ్డి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



వెలుగోడులో బ్రోచర్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీతోనే పేదల ఆర్థికాభివృద్ధి

మహానంది: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారానే పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా పాల మహేశ్వరరెడ్డి అన్నారు. మసీదుపురం గ్రామంలో సర్పంచ్ కాకనూరు లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మునగాల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో రూ. 14.67కోట్ల మేరకు లబ్ధి చేకూరడంతో పాటు అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, మండల నాయకులు కేతపల్లి గోపాలకృష్ణ, ఏపీ కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మసీదుపురంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

- సచివాలయ వ్యవస్థ ద్వారా నిజమైన గ్రామ స్వరాజ్యం పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామంలో మంగళవారం పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో జరిగిన లబ్ధి, అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 20.69 కోట్ల సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ పుష్పావతమ్మ, జేసీఎస్ అధ్యక్షుడు ముడిమెల పుల్లారెడ్డి, సంతజూటూరు సొసైటీ చైర్మన్ బూరం శివలింగం, మార్కెట్‌యార్డు డైరెక్టర్ విక్రమసింహనాయక్, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్, నాయకులు పాల్గొన్నారు.



పెద్దదేవళాపురంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు

పశు ఆరోగ్య కార్డులతో బహుళ ప్రయోజనం

పగిద్యాల: రాష్ట్రప్రభుత్వం జారీ చేయనున్న పశు ఆరోగ్య కార్డులతో పశుపోషకులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని జూపాడుబంగ్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు(ఏడీ) రామాంజనేయ నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక పశుగణాభివృద్ధి కేంద్రంలో పశు విజ్ఞాన బడి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ పుల్యాల దివ్య, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏడీ మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి 30వ తేదీలోగా మండలంలోని పశుపోషకులకు పశు ఆరోగ్య కార్డులను జారీ చేస్తామని వెల్లడించారు. పాడి రైతులు ఈ కార్డు ద్వారా బ్యాంక్‌లో రుణం పొందేందుకు అర్హులవుతారని వివరించారు. గతంలో కేవలం గేదెలకు మాత్రమే బీమా సౌకర్యం వర్తించేదని ఇప్పుడు ఎద్దులకు కూడా విస్తరింపజేశారన్నారు. అనంతరం పశు ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు శ్రుతికీర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పశు ఆరోగ్య కార్డులను అందజేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, అధికారులు

సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయండి

అత్మకూరు: పట్టణంలో ఈ నెల 24న నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు వివిధ వర్గాలతో, కార్యకర్తలతో మంగళవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా కార్తీక్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యాలయంలో డీలర్ల అసోసియేషన్ , టైలర్ల అసోసియేషన్, ప్రైవేట్‌కళాశాల అధ్యాపకులతో పాటు తటస్థంగా ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు నేరుగా నగదు జమ చేశారని, అవినీతి రహిత పాలన అందిస్తూ ప్రజల అభిమానం చూరగొన్నారని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులతో మాట్లాడుతున్న శిల్పా కార్తీక్ రెడ్డి

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ విజేత కర్నూలు జట్టు

మిడుతూరు: మండలంలోని లక్ష్మీచెన్నకేశవ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 67వ ఎస్జీఎఫ్ బేస్ బాల్ పోటీల్లో బాలికల విభాగంలో కర్నూలు జట్టు విజయం సాధించినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్, టోర్నమెంట్ అబ్జర్వర్ జయరాముడు తెలిపారు. మంగళవారం చివరి రోజు నిర్వహించిన పోటీలకు మండల ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, ఎంఈఓ శ్రీనాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోటీల్లో బాలికల విభాగంలో మొదటి స్థానంలో కర్నూలు, రెండో స్థానం విజయనగరం , మూడో స్థానం శ్రీకాకుళం జట్లు కై వసం చేసుకున్నాయి. బాలుర విభాగంలో మొదటి స్థానంలో విశాఖపట్టణం, రెండో స్థానంలో విజయనగరం, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాల్గో స్థానంలో కర్నూలు జట్లు నిలిచాయి. విజేత జట్లకు ముఖ్య అతిథులు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తువ్వా శివరామక్రిష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగతులసీ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ శివకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



విజేత కర్నూలు బాలికల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

యునాని వైద్య శిబిరం

నందికొట్కూరు: పట్టణంలోని హజీనగర్‌లోని ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో మంగళవారం డాక్టరు జమాలుద్దీన్ ఆధ్వర్యంలో ఉచిత యూనాని వైద్య శిబిరం నిర్వహించారు. 147 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు రహమత్‌బీ, మహబూబ్ బాషా, అస్గర్ నయాబ్, షాహీద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నందికొట్కూరు రూరల్ : వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం బొల్లవరం గ్రామానికి చెందిన కార్యకర్త సుధాకరరెడ్డి(59) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

24న విగ్రహాల ప్రతిష్ఠ

మిడుతూరు : మండల కేంద్రంలో ఈ నెల 24న శ్రీ వినాయక, శ్రీ శివుడు, శ్రీలింగమయ్య, శ్రీ నందుల నాగమయ్య విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు బాలకృష్ణశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహానందిలో కొనసాగుతున్న రద్దీ

మహానంది: కార్తీకమాసం సందర్భంగా మహానంది ఆలయంలో భక్తుల సందడి కొనసాగుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉన్న నంది విగ్రహం, నంది స్థూపం, నాగులకట్ట ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారితో పాటు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించి దర్శించుకున్నారు.

మొదటి సోమవారం రూ. 12లక్షల ఆదాయం

కార్తీకమాసం మొదటి సోమవారం భక్తులతో మహానంది కిటకిటలాడిన విషయం తెలిసిందే. ఈ మేరకు మొదటి సోమవారం సందర్భంగా ఆర్జిత సేవా టికెట్లు, ప్రసాదాల విక్రయం, అభిషేకాలు, వసతిగృహాలు, ఇతర విభాగాల ద్వారా సుమారు రూ. 12లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఆలయ అధికారవర్గాలు తెలిపాయి.

రబీలో ఆరుతడి పంటలే మేలు



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయులు

వెలుగోడు: రబీలో ఆరుతడి పంటల సాగుతో అధిక లాభం పొందవచ్చని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు సూచించారు. మంగళవారం మోతుకూరు గ్రామంలో రబీ పంటల సాగుపై మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. సాధారణ కంటే తక్కువ వర్షపాతం దృష్ట్యా రబీలో వరి వేయవద్దని, ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని, కే.సీ.కెనాల్, తెలుగు గంగ ప్రాజెక్ట్ అధికారులు తెలిపారని సూచించారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా మినుము, కుసుమ, ఆవాలు, పెసర తదితర ఆరుతడి పంటలు లేదా చిరుధాన్యాలు రాగి, కొర్ర,సజ్జ మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈఓ సుధారాణి, ఆర్బీకే ఇన్‌చార్జ్ నాగలింగం, వీఆర్వో సుగుణాకర్, మాధవరం సర్పంచ్ బ్రహ్మానంద రెడ్డి, మోత్కూరు వ్యవసాయ సలహా మండలి సభ్యులు విజయభాస్కర్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితాలకు భరోసా

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఎమ్మెల్సీ ఇసాక్‌తో కలిసి వీబీఆర్‌లో చేప పిల్లల విడుదల

వెలుగోడు: మత్స్యకారుల జీవితాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే భరోసా లభిస్తోందని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద 11 లక్షల చేపల పిల్లలను వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఎమ్మెల్సీ ఇసాక్‌తో కలిసి విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న సంక్షేమ పథకాలతో మత్స్యకారుల బతుకులకు భరోసా లభిస్తుందన్నారు. చేపలవేట నిషేధ కాలంలో ఇంతకు ముందు కేవలం రూ.4వేలు ఉన్న భృతిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మత్స్యకార భరోసా కింద ఏకంగా రూ.10 వేలకు పెంచి సాయం అందిస్తోందని చెప్పారు. వేట సమయంలో ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఇచ్చే బీమా గత ప్రభుత్వంలో నామమాత్రంగా ఉంటే జగనన్న ప్రభుత్వం రూ.10 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.5 లక్షలు ఇస్తుందన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రకటించిన విద్యుత్ చార్జీలు, ఆయిల్ సబ్సిడీ లాంటి రాయితీలను తమ ప్రభుత్వం రాగానే అమలులోకి తేవడంతో అటు ఆక్వా రైతులు, మత్స్యకారుల్లో సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి అధికారి భరత్‌లాల్ నాయక్, వీఎఫ్ఏ అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణఅధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, తెలుగు రమణ, షంషీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



వీబీఆర్‌లో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై 17వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఓ విమలమ్మ మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. సంబంధిత శాఖ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.